

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## మగాడు

**కారెక్కగానే** సుశీల ఉత్సాహంగా ఏదో మాట్లాడబోయింది. కానీ భర్త డ్రైవర్ వైపు కనుసైగ చేసి చూపగానే అతికష్టం మీద అణచుకుని ఆనందంగా కిటికీలోంచి చూడసాగింది. ఇల్లురాగనే దిగి తలుపు తాళం తెరిచి ఫేన్ వేస్తూ చెప్పింది.

"నాకు అమ్మాయి బాగా నచ్చింది. తెల్లగా ఎంతబావుందో?"

"అమ్మా!" ఆక్రోశంగా అరిచాడు కార్తీక్.

"ఏరా నీకు నచ్చలేదా? అమ్మాయికేం తక్కువ?" అడిగింది.

"అన్నీ తక్కువే"

"కొద్దిగా సన్నగా ఉంది అంతేగా? ఐనా ప్రతీవాళ్ళూ పిల్ల సన్నగా తెల్లగా ఉండాలి అంటూంటారు కదా? సౌమ్య కూడా చక్కగా తెల్లగా సన్నగా ఉంది. మంచి కుటుంబం..." సుశీల ఆయాసంతో ఆగింది.

"అమ్మా! తెల్లగా ఉంటే అందంగా ఉన్నట్లేనా? సన్నగా తాటాకు బొమ్మలాగా ఉంది. కాదు కాదు బియ్యంలో తెల్ల పురుగులాగా ఉంది. నాకొద్దు." కార్తీక్ ఖరాఖండీగా చెప్పి టి.వి ఆన్ చేసాడు.

అంతదాకా మౌనంగా విన్న తండ్రి చెప్పాడు.

"సన్నం ఓ సమస్యకాదు కార్తీ. ఆడపిల్లలు పెళ్ళయిన ఏడాదిలో కనీసం పది కిలోలు పెరుగుతారు. సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం. నీకు ఆర్థికంగా సహాయంగా ఉంటుంది."

"ఔను. ఒక్కతే పిల్లయినా పనీపాట అన్నీ వచ్చుట." సుశీల వంత పాడింది.

"ఆ అమ్మాయిలో కళాకాంతి లేవు నాన్నా." అక్కడినించి లేచి వెళ్ళిపోయాడు కార్తీక్.

వంపు సొంపులు అంటే తల్లిదండ్రుల ముందు బావుండదని.

అమ్మా నాన్నల సామ దాన భేద దండోపాయాలతో పెళ్ళిపీటల మీద కూర్చున్న కార్తీక్‌కి తన మీద తనకే జాలివేసింది. ఎన్ని కలలు కన్నాడు. భార్య అనగానే ఆ సీజన్‌లో పాపులర్ అయిన సినీనటి కళ్ళముందు మెదిలేది. కొంచెం బొద్దుగా, కొంత నాజూగ్గా మిసమిసలాడే హీరోయిన్లు కలలోకొచ్చేవారు. ఇప్పుడు బియ్యంలో తెల్లపురుగులాంటిదాన్ని చేసుకోవాల్సివస్తోంది!

జీలకర్ర, బెల్లం పెట్టించి తెరసెల్లా తీసేసాక సౌమ్య అతని వైపు సిగ్గుగా చుసి చిరునవ్వు నవ్వింది.

'ఈ అమ్మాయిలో ఏదైనా ఆకర్షణ ఉంది అంటే అది నవ్వే. మొహమంతా వెలుగుతోంది నవ్వుకి' అనుకున్నాడు కార్తీక్.

తొలిరాత్రి భార్యని కౌగిలించుకున్న కార్తీక్‌కి ఎముకలు తగిలాయి. మనసు బాధతో మూలిగింది కానీ వాతావరణం ముందుకి పొమ్మని ప్రోత్సహించింది.

జీవితం రొటీన్‌గా సాగుతోంది. సౌమ్య నిజంగానే మంచి పనిమంతురాలు. మంచిపిల్ల. నిశ్శబ్ధంగా పనులు చేసుకుని అతనికీ, తనకీ లంచ్ కోసం బాక్స్ ప్రిపేర్ చేసి కార్తీక్ కంటే ముందే ఆఫీస్‌కి వెళ్ళిపోతుంది. అతనికంటే ముందే ఇల్లు చేరుకుని రాత్రి భోజనం సిద్ధం చేసేది. అతను నిద్రలేచి బెడ్‌రూంలోంచి బయటికి రాగానే అతన్ని చూసి చిరునవ్వు నవ్వేది. ఆఫీస్ నుంచి వచ్చినప్పుడు తలుపుతీయగానే నవ్వేది. ఆ నవ్వుల్లో వెలిగే ఆమె ముఖం చూసి అతను కొద్దిగా మెత్తబడేవాడు. కానీ అవసరమైన మేరకే మాట్లాడుతూ అది తన స్వభావం అన్నట్లుగా ప్రవర్తించడం మానలేదు.

తన ఆఫీస్ కొలీగ్ పెళ్ళి రిసెప్షన్‌కి వెళ్ళిన కార్తీక్ పెళ్ళికూతురిని అలాగే చూస్తూండిపోయాడు. తను ఎలాంటి అమ్మాయిని పెళ్ళిచేసుకుందాం అనుకున్నాడో అచ్చం అలాగే ఉంది. మనసు అసూయతో రగిలింది.

"ఒరే కార్తీక్. ఇటు ఇక్కడ." దూరం నుంచి ఫ్రెండ్స్ పిలిచారు.

గిఫ్ట్ ఇచ్చి వెళ్ళి టేబుల్ ముందు కూర్చున్నాడు కార్తీక్. అప్పటికే వాళ్ళు రెండు మూడు గ్లాసుల వైన్ తాగేసి నిదానంగా తింటూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

"ఏం ఫిగర్‌రా. కొబ్బరి ముక్కలా ఉంది. నమిలేయాలనిపిస్తోంది." ఒకతను చికెన్ ముక్క నములుతూ చెప్పాడు.

"అవును మనవాడు లక్కీఫెలో. ఇలాంటి పెళ్ళాం ఉంటే ప్రతీరాత్రి వసంత రాత్రే" మరొక మిత్రుడు చెప్పాడు.

స్టేజ్ మీద జంటని చూస్తూ ఇంకో ఫ్రెండ్ అడిగాడు.

"అవి నిజమైన అందాలే అంటావా? లేక మేకప్ మహత్యమా!"

"నీ మొహం. ఆ బాడీ చూడు ఎంత ప్రపోర్షనేట్‌గా ఉందో! పెట్టుడు అందాలకి అలా ఉండదు" మొదటివాడు నిర్ధారించాడు.

"...."

"...."

"..."

వాళ్ళు ఆమె బుగ్గలని తడిమారు. పెదవులమీద ముద్దు పెట్టుకున్నారు. ఆమెని వివస్త్రని చేసారు. అంగాంగం వర్ణించారు. ఆమెతో మానసిక వ్యభిచారం చేసారు.

కార్తీక్‌కి ఆ సంభాషణ అసహనంగా అనిపించింది. నెమ్మదిగా కోక్ సిప్‌చేస్తూ వాళ్ళ మాటలు అయిష్టంగా వింటూ ఇక వినలేనప్పుడు ‘వస్తారా‘ అని లేచి ఇంటికి వెళ్ళిపోయాడు.

బెల్ చప్పుడికి తలుపు తీసిన సౌమ్య భర్తని చూసి చిరునవ్వు నవ్వింది. బియ్యంలో తెల్లపురుగులాంటి తన భార్యని ఆప్యాయంగా చూసిన కార్తీక్ బదులుగా ప్రేమగా నవ్వాడు.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments on this story